క్లుప్తంగా

చర్చి ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ దోకులగూడ గ్రామంలో నిర్మించిన ఆర్‌సీఎం పునీత చిన్న తెరేజమ్మ దేవాలయం ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్‌కే పాడు తిరుహృదయ దేవాలయం ఫాదర్ ఛార్లెస్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కేథలిక్ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శ్రీకాకుళం పీఠాధిపతులు రాయరాల విజయ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని దేవాలయాన్ని ప్రారంభించారు. క్రైస్తవ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలు విచారణలకు చెందిన ఫాదర్లు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి పాహిమాం


భక్తులకు దర్శనమిచ్చిన వీరఘట్టం ఇలవేల్పు శ్రీకోటదుర్గతల్లి

వీరఘట్టం: అమ్మా... జగన్మాతా... రాజరాజేశ్వరి పాహిమాం రక్షమాం... అంటూ భవానీ భక్తులు శుక్రవారం శ్రీకోటదుర్గ ఆలయంలో పూజలు చేశారు. వీరఘట్టం ఇలవేల్పు శ్రీకోటదుర్గ తల్లి ఆలయంలో 150 మంది భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. వీరికి యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ మాలాధరణ చేశారు. భవానీ భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం జై భవానీ నామస్మరణతో మారుమ్రోగింది.

పరిశుభ్రతే లక్ష్యం కావాలి

గరుగుబిల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం కావాలని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీని నిర్వహించి అనంతరం పరిసరాలను శుభ్రం చేయించడం, రక్షిత పథకానికి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతతో పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ మార్థాన్‌పై వర్క్‌షాప్


వర్క్‌షాపును ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి, డిప్యూటీ డీఈవో

పాలకొండ రూరల్: ఏజెన్సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు స్కూల్ ఇన్నోవేషన్ మార్థాన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సూర్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరింపజేసే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సైన్స్, గణిత ఉపాధ్యాయులు తమ విద్యార్థులచే ప్రాజెక్టులు సిద్ధం చేయించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇన్నోవేషన్ ముఖ్య ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. గతంలో మన జిల్లా నుంచి సాధించిన విజయాలపై విద్యార్థులకు విశ్లేషించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలో సంబంధిత ఉపాధ్యాయులు హాజరయ్యారు.

మహిళలకు ఉచిత వైద్యం : డీఎంహెచ్‌వో


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు

కురుపాం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ద్వారా మహిళలకు ఉచిత వైద్యం అందుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డా.భాస్కరరావు అన్నారు. మండలంలోని గుమ్మ హెల్త్ వెల్నెస్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ ఉచిత సేవలను మహిళల కోసం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మహిళలే సమాజానికి పునాదులని, వారి ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయన్నారు. ప్రతీ మహిళ తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉంటే అనారోగ్య సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఉత్సవాలకు

సర్వం సిద్ధం


కోటదుర్గమ్మ


సుందరంగా అలంకరిస్తున్న అమ్మవారి ఆలయం

- ముమ్మర ఏర్పాట్లు చేపట్టిన అధికారులు
- 22న అమ్మవారి నిజరూప దర్శనం
- లక్ష సంఖ్య దాటి భక్తులు వస్తారని అంచనా
- భద్రతా ఏర్పాట్లుపై ప్రత్యేక దృష్టి

పాలకొండ/పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. కోటలో వెలసిన కోటదుర్గమ్మ వారి దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఉత్తరాంధ్రలో విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయం తరువాత అంతగా ప్రత్యేకంగా నిర్వహించే దసరా ఉత్సవాలు అంటే ఈ ప్రాంతంలో ప్రత్యేకత ఉంది. తొమ్మిది రోజుల పాటు లక్షల సంఖ్యలో భక్తులు పలు రకాలుగా అమ్మవారిని కొలుస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పక్క రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం ఆనవాయితీ.

ముమ్మర ఏర్పాట్లు

ఈ ఏడాది దసరా ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహించేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా స్థల సమస్య వస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది పరిసరాల్లో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలను అమ్మవారి ఉత్సవాల కోసం కేటాయించారు. ప్రతి రోజు వేల సంఖ్యలో అమ్మవారికి సంబరాలు భక్తులు చేస్తుంటారు. ఆ మేరకు వారికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం ఆవరణలో తొమ్మి రోజుల పాటు సామూహిక కుంకుమ పూజలు నిర్వహణ కోసం ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రాంగణం కేటాయించారు.

22న నిజరూప దర్శనం

కోటదుర్గమ్మ నిజరూప దర్శనం కలగడం భాగ్యంగా భక్తులు భావిస్తారు. ఏడాదిలో ఒక రోజులో కొన్ని గంటలు మాత్రమే ఈ దర్శనం కలుగుతుంది. ఈ ఏడాది 22న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారి నిజరూప దర్శనం కల్పించనున్నారు. నిజరూప దర్శనం కోసం లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

ఈ ఏడాది అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనంతో పాటు వీఐపీ దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శనం ఉంటుంది. భక్తులు తమ సహకారం అందించాలి.

– సూర్యనారాయణ, ఆలయ ఈవో


భక్తుల పూజలు అందుకునేందుకు సిద్ధమవుతున్న అష్టాదశ శక్తి పీఠం

అష్టాదశ శక్తి పీఠాలు

నక్కలపేటలో షిర్డీ సాయి సహిత సకల దేవతాలయంలో విజయదశమి వేడుకలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఈ ఆలయంలో ప్రత్యేకంగా అష్టాదశ శక్తి పీఠాలను కొలువు దీర్చనున్నారు. ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం 8.30కి శక్తి పీఠాల ప్రతిష్ఠ, కలశ స్థాపన చేపట్టనున్నట్టు అర్చకులు శరత్ కుమార్ తెలిపారు. 18 రూపాల్లో అమ్మవారు స్వయం శక్తి స్వరూపిణిగా భక్తులకు దర్శనమీయనుంది. పాలకొండ గోదారమ్మగా చెప్పబడుతున్న వెంకటరాయుని కోనేటి గట్టుపై ఉన్న ముగ్గురమ్మల ఆలయంలో, అగ్నిమాపక కేంద్రం వద్ద కొలువుదీరిన గ్రామదేవత గారమ్మ ఆలయంలో, విశాఖ రహదారిలో గల సాయి గాయిత్రీ, శ్రీకాకుళం రహదారిలో కొలువైన పంచముఖ గాయిత్రీ మంత్రాలయంలో దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు భక్తులు, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు.


భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న కుంకుమ పూజా స్థలం

ఉత్సవ కమిటీనే దిక్కు....

కూటమి ప్రభుత్వం దేవాలయాలకు బోర్డుల ఏర్పాటు పూర్తి చేయకపోవడంతో ఈ ఏడాది ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. కూటమి నాయకుల గ్రూపుల మధ్య అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై భక్తులకు సందేహాలు కలుగుతున్నాయి. దేవాలయంపై పెత్తనం కోసం కూటమి నాయకులు గ్రూపులుగా అధికారులపై వత్తిడి తీసుకువస్తున్నారు.

క్యూలైన్లు ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఉత్సవాల్లో ప్రధాన సమస్య నిజరూప దర్శనం ఆ రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం ఆనవాయితీ. ఇదే సమయంలో వీఐపీల పేరుతో వచ్చిన వారు అమ్మవారి గర్భగుడి వద్ద నిలిచి ఉంటున్నారు. దీంతో సామాన్య భక్తులకు దర్శనం కష్టంగా మారుతుంది. ఈ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

భద్రతపై దృష్టి

ఉత్సవాల్లో జేబు దొంగలు, అల్లరి మూకలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా ఈ సమస్య పోలీసులకు తప్పడం లేదు. ప్రధాన అమ్మవారి తిరువీధిలో అల్లర్లు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

ఘనంగా ముగిసిన విశ్వకర్మ జయంతి

పాలకొండ రూరల్: శ్రీమద్ విరాట్ విశ్వకర్మ జయంతోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. స్థానిక సనారీ విశ్వేశ్వర స్వామి జ్ఞాన మందిర ప్రాంగణంలో కొలువుదీర్చిన విశ్వకర్మ మండపంలో స్వామి వారికి దంపతులు పెద్దెత్తున సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు దేవతల శిల్పికి మొక్కులు సమర్పించారు. అనంతరం దివ్య రథంపై స్వామిని కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో శోభా యాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. శ్రీ సనారీ విశ్వేశ్వర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘం, సనారి మఠం అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం వైభవంగా జరిగింది.


భక్తుల పూజలందుకుంటున్న విరాట్ విశ్వకర్మ

పనులు తక్కువ.. చెల్లింపులు ఎక్కువ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 27 పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి నీటి కుంటలు, ఫాం పాండ్లు, భూ అభివృద్ధి పనులను తక్కువ కొలతల్లో చేసినప్పటికీ కొలతల్లో ఎక్కువ చూపుతూ వేతనదారులకు చెల్లింపులు చేసినట్టు సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో బహిర్గతం చేశారు. ఈ మేరకు మండలంలోని 27 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 30వ తేదీ వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.35 కోట్లతో 2939 రకాల పనులను ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖల ద్వారా చేపట్టారు. ఈ మేరకు గ్రామ స్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అంశాలను చర్చించేందుకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీహరి, స్టేట్ అబ్జర్వర్ ఎం.కోనయ్య, డీఆర్‌డీఏ డీపీఎం జయశ్రీ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందాలు ఎస్‌ఆర్‌పీ ఇ.పున్నపునాయుడు ఆధ్వర్యంలో పలు అంశాలను బహిర్గతం చేశారు. పలు పంచాయతీల్లో మస్టర్లలో దిద్దుబాట్లు, సంతకాల్లో తేడాలు, కొలతల్లో భారీగా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. పనులకు వెళ్లనప్పటికీ పనికి వెళ్లినట్లు నెల్లికిక్కువ పంచాయతీకి చెందిన పది మందికి రెండు వారాలు మస్టర్లలో పేర్లు నమోదు చేసి చెల్లింపులు చేపట్టినట్లు గుర్తించారు. మండ పంచాయతీలో అర్హత లేనప్పటికీ సింగిల్ ఉమెన్‌కు పెన్షన్‌ను ఇస్తున్నారని గుర్తించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్లు, ప్రహరీలకు సంబంధించిన కొంత మొత్తం నగదును వెండర్ల ఖాతాలోకి కాకుండా సంబంధిత శాఖ అధికారుల ఖాతాల్లోకి జమ చేసినట్టు గుర్తించారు. ఆయా పంచాయతీల్లో పనులు కావాలని దరఖాస్తు చేసుకున్న వారికి పనులు కల్పించకపోవడం, మస్టర్లతో సంతకాలు లేకుండా చెల్లింపులు చేపట్టినట్లు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారుల చర్యలకు సిఫార్సు చేసినట్లు ఏపీడీ శ్రీహరి పేర్కొన్నారు.


ఉపాధి హామీ పథకం నిధులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించాలి

గుమ్మలక్ష్మీపురం: ఆరోగ్యకరమైన జీవనంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని అక్టోబర్ 16వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు భద్రగిరి సీడీపీఓ కె.విజయగౌరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు నాగమణి, ఉషారాణి, నిర్మల, గౌరమ్మ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టర్‌కు వినతి

కురుపాం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు శుక్రవారం కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రెండు దశాబ్దాలుగా చాలీ చాలని జీతంతో గిరిజన విద్యార్థులకు చదువులు చెబుతున్నామని మెగా డీఎస్సీలో మా పోస్టులు కలిపి మాకు ఉపాధి లేకుండా చేసి మా కుటుంబాలను రోడ్డు మీద పడేయవద్దని విజ్ఞప్తి చేశారు. తమను ఆదుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్, లక్ష్మీకుమారి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి

గుమ్మలక్ష్మీపురం: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన రేగిడి, దొరజమ్ములలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను స్థానిక వైద్య సిబ్బందితో కలసి సందర్శించారు. ఈ మేరకు సిక్ రూంలను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.అనంతరం వారికి ఆరోగ్య సమస్యలు ప్రారంభమైన, కోలుకున్న తేదీలు అందించిన చికిత్స వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బంది ఆదేశించారు. అలాగే విద్యార్థులకు రక్త పరీక్షలు చేసిన నివేదికలను పరిశీలించారు. స్థానిక వైద్యాధికారి. డా.పి.ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం వి.స్వాతి, డెమో సన్యాసిరావు, వార్డెన్ జోగిలత, వెంకటేశ్వరరావు, రైతు సిబ్బంది పాల్గొన్నారు.



సిరులొలికించే ధాన్యలక్ష్మి

రైతన్నల రెక్కల కష్టంకు చేలో పండే పంటే సేద తీరుస్తుంది. ఈ ఏడు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణ ప్రతికూలత, సర్కారు మెండి చేయి చూపిస్తున్నా రైతన్న కష్టాన్ని నమ్ముకున్నాడు. వరుస వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేసినా భగవంతునిపై భారం వేశాడు. కీలక దశలో చేతిలో ఎరువులు లేక అధిక మదుపులకు సొమ్ము లేక అప్పుల కోసం చేతులు చాచాడు. నేటికి పిడికెడు యూరియా కోసం పాట్లు పడుతున్నాడు. ఇన్ని సమస్యల నడుమ తమ పంట భూముల్లో పచ్చదనం అలముకుంటున్న తీరుతో తమ కష్టం మరిచిపోతున్నాడు. ప్రస్తుతం వరి పంట కీలక చిరుపొట్ట దశకు చేరింది. దీంతో తేలిక రకాలు, ముందు వరుసలో వేసిన వరి రకాలు పొట్ట విడిచి పెడుతున్నాయి.

– పాలకొండ రూరల్

జిల్లా స్థాయిలో సత్తా చాటాలి

వీరఘట్టం:

ఇటీవల జరిగిన మండల స్థాయి ఆటల పోటీలతో పాటు, డివిజన్ స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో తమ ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను హెచ్.ఎం సొంబర శుక్రవారం అభినందించారు. శనివారం జిల్లా స్థాయిలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న పోటీల్లో కూడా సత్తా చాటాలని విద్యార్థులను ఆశీర్వదించారు. మొత్తం ఈ పోటీల్లో పాల్గొంటున్న 24 మంది క్రీడాకారులను ఉపాధ్యాయ సిబ్బంది అన్ను వెంకటరావు, శిర్లాపు ఉమామహేశ్వరరావు, ఎం.ఎల్.ఎస్ నాయుడు తదితరులు అభినందించారు.


జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యా ప్రమాణాల గుర్తింపు

భామిని: మండలంలోని పెద్దదిమిలి జెడ్పీహెచ్ స్కూల్, ఎంపీపీ స్కూల్, ఘనసర ఎంపీపీ పాఠశాలలను వమ్మరివల్లి డైట్ కళాశాల నుంచి వచ్చిన అధ్యాపకుల బృందం శుక్రవారం సందర్శించింది. విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. అధ్యాపకులు టి.వెంకటరావు, జె.నాగరాజు, ఎస్.ప్రసాద్ పాఠశాల విద్యార్థుల తరగతులు పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు సమాధానాలు రాబట్టారు. నోట్ పుస్తకాలు, రికార్డులు, అందుతున్న భోజనం, హాజరు పరిశీలించారు. హెచ్‌ఎం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో చర్చించారు. సీఆర్‌పీ కిశోర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెద్దదిమిలిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డైట్ అధ్యాపకులు

కుక్కల సంచారంతో హడల్

పాలకొండ రూరల్: నగర పంచాయతీలో కుక్కల గుంపులు పట్టణ వాసులను హడలెత్తిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఈ కుక్కల గుంపులు భారీ సంఖ్యలో తిరుగాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు స్థానికులు వాపోతున్నారు. పండగల సీజన్ కావటం, జన సంచారం అధికంగా ఉంటుంది. ఏ క్షణం ఎవరిపై దాడి చేస్తాయో అన్న ఆందోళన వ్యక్తమవుతుంది. పెద్దలతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పిల్లలు ఈ కుక్కల గుంపుల హడావిడితో భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ గుంపులు ముదునూరివారి వీధి, ఆసుపత్రి రహదారిలో, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన మార్కెట్ తదితర ప్రాంతాల్లో కలియతిరుగుతూ పాదచారులను హడలెత్తించాయి.


ముదునూరు వారి వీధిలో హల్‌చల్ చేస్తున్న కుక్కల గుంపు

సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ

వీరఘట్టం: కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేయాలని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా తూకంలో తేడాలు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే ఆ డీలరుపై 6-ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే 60 ఏళ్ల దాటిన వారికి ఈ నెల 26 నుంచి వాళ్ల ఇంటికి వెళ్లి సరుకులు ఇవ్వాలని సూచించారు. కార్డుదారులతో స్నేహంగా ఉండాలని సూచించారు.


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు

విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలి


మట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీవో

సీతంపేట: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. స్థానిక ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటీడబ్ల్యూవోలు క్షేత్ర స్థాయిలో పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పెడుతున్న భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో ప్రతీ గురువారం సంబంధిత ఏఎన్‌ఎం, వైద్య సిబ్బందితో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీఈఈ రామ్మోహన్‌రావు, ఏటీడబ్ల్యూవోలు సూర్యం, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సేవలు సంతృప్తికరం

జియ్యమ్మవలస రూరల్:

చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందిస్తున్న సేవలు సంతృప్తికరమే అయినా ఆస్పత్రి పరిసరాలు సుందరంగా తీర్చిదిద్దాలని, అలాగే గదుల పరిశుభ్రత మెయింటెనెన్స్ సరిగ్గా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయనతో పాటు జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి గదులకు కిటికీలు, తలుపులు వెంటిలేటర్లు సరిగ్గా ఉండాలన్నారు. అలాగే ల్యాబ్‌లో అన్ని పరీక్షలు నిర్వహించి పేషెంట్లను సంతృప్తికరంగా చూడాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి మంచి పండ్ల చెట్లను, పూల మొక్కలను, ఆసుపత్రికి ఆదాయాన్ని అందించే మొక్కలను నాటాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్‌జీ నాగభూషణరావు, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఆర్.ఆర్.కె.చైతన్య, డాక్టర్ దుర్గాప్రసాద్. డాక్టర్ పూర్ణ చంద్రిక, డాక్టర్ రమ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీలు

ఘనంగా హిందీ దినోత్సవం

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న హిందీ పక్షోత్సవాలలో భాగంగా హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్ పండా, అనూరాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల పాటలు, నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు, ఆకుల జగదీష్ , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.